# కోపాలు

## గుడిసేవ సుందరరామయ్య

"ఆనంద్!" అంటూ గట్టిగా అరవాలనుకొంది సుశీల. కాని గొంతుక పెగల్లేదు.

హృదయ కుహరాల్లోంచి పైకి చిమ్ముతున్న దుఃఖం, ఉబికివస్తున్న ఉద్వేగం ఆమె స్వరాన్ని స్వాధీనం చేసుకొన్నాయి.

మధ్యాహ్నపుటెండలో వాడిపోయిన ఎర్రగులాబిలా మారిపోయింది ఆమె వదనం!

కళ్ల క్రింద ఏర్పడిన చారలు మరింత నల్లగా కనిపించాయి!

ఎర్రటి చెక్కిళ్ళు మరింత ఎర్రదనాన్ని పులుముకొన్నాయి.

పలచటి పెదాలు గులాబిరేకుల్లా కంపించాయి.

ముక్కుపుటాలు ఎగిరెగిరి పడుతున్నాయి.

ఆకర్షణీయమైన ఆమె కళ్లు చెమ్మగిల్లాయి.

ఆశ్చర్యం, ఆవేదన, ఆవేశం— అన్నీ ఒక్కసారే ఆమె ముఖంలో చోటు చేసుకొని ఆమె వయస్సును మరింత పెంచటానికి చూస్తున్నాయి. చేతిలో ఉన్న ఉత్తరాన్ని నేలమీదికి విసిరి, మంచంమీద వాలిపోయి తలగడదిండులో ముఖాన్ని దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

'ఆనంద్ తన నెంత అపార్థం చేసుకొన్నాడు!

ఇంత కాలంగా తన మనస్తత్వాన్నే అర్థం చేసుకోలేకపోయాడా?

చిన్నప్పట్నుంచీ కంటికి రెప్పలా కాపాడినందుకు ప్రతిఫలంగా నేడు ఆనంద్ తనను అసహ్యించుకొంటున్నాడా?

"నీవు నిజంగా దేవతవు, అక్కా! నా సుఖం కోరి నీ సుఖాన్నే త్యాగం చేసిన పుణ్యమూర్తివి! తలిదండ్రులు లేని కొరతను తీర్చావు! నీ లాంటి అమృత హృదయంగల అక్క లభించటం నిజంగా నా అదృష్టం!" అన్న ఆనందేనా ఈ నాడు ఇలా రాసింది?

"నీ ఆశీస్సులతో నేను బి. కామ్. పాస్ కావటమే కాకుండా మంచి ఉద్యోగాన్ని కూడా సంపాదించుకొంటాను. నేను సంపాదించే మొదటి నెల జీతంతో నీ కో మంచి చీరె కొంటాను! ఓ మంచి నెక్లేస్ చేయిస్తాను! నీ ఆశీస్సులే లేకుంటే నే వింతవాణ్ణి అయ్యేవాణ్ణే కాదు!" అన్న ఆనందేనా ఈ నాడు ఇలా రాసింది?

గతంలో తనమీద ఏర్పరుచుకొన్న మమతానురాగాలన్నీ ఏమయ్యాయి? ఇలా జరగటానికి కారణం ఏమిటి?

కేవలం ఒక్క ఆడదాని ఆకర్షణలో పడి యుక్తాయుక్త విచక్షణను కోల్పోవటమే అందుకు కారణమా?

అతను ప్రేమిస్తున్న యువతిని పెళ్లాడవద్దని తను అభ్యంతరం చెప్పటమే అందుకు కారణమా?

చిన్నప్పట్నుంచీ మనస్సులో పెంచుకొన్న మమకారం ఆ ప్రేమ ముందు బానిస అయి తల ఒగ్గిందా?

తన మనస్సులో హాలాహలం దాగుందని ఆనంద్ తెలుసుకోలేకపోతున్నాడు! ఏ విషయాన్నికూడా పైకి విడమరిచి చెప్ప లేని అసహాయస్థితి తనది! హే, భగవాన్! ఇప్పు డేం చేయాలి?

తన మనస్సులోని ఉద్దేశాన్ని ఆనంద్‌కు ఎలా చెప్పాలి?

తన హృదయా వేదనను ఆనంద్‌కు ఎలా తెలియజెప్పాలి?

జీవితంలో అడుగడుగునా తనకు విషమ సమస్యలు ఎదురౌతూనే ఉన్నాయి. ఇంత వరకు ప్రతి సమస్యను అంతులేని ధైర్యంతో తను ఎదుర్కొంటూనే ఉంది!

ఎందుకోసం?

తన ఆనంద్ కోసం! వాడి భవిష్యత్తు కోసం!'

బయట తలుపు కొట్టిన శబ్దమయ్యే సరికి సుశీల ఆలోచనలకు అంతరాయం కలిగింది.

మెల్లగా వెళ్లి తలుపు తీసింది. శేఖరం లోపలికి వచ్చాడు.

విషాదఛాయలను పులుముకొన్న సుశీల ముఖాన్ని చూడగానే శేఖరం కొంచెం దిగ్భ్రాంతి చెందాడు.

"సుశీలా! ఏమి టలా ఉన్నావ్? ఏమైంది?" ఆత్రంగా అడిగాడు.

"ఏమీ లేదు, శేఖర్!" అంటూ చీర కొంగుతో ముఖాన్ని తుడుచుకొంది.

"నీ పెదాలు అబద్ధం చెపుతున్నాయన్న సంగతి కన్నీటిచారలు కట్టిన నీ ముఖం చూస్తేనే తెలుస్తుంది! ఇంతకూ అస లేం జరిగిందో చెప్పు, సుశీలా!"

"మానవ హృదయాలమీద మంచి చెడ్డల ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో అర్థం చేసుకొంటున్నాను! ఒక మనిషి మీద ఏవో కారణాల చేత చెడ్డ అభిప్రాయం ఏర్పడిన మరుక్షణమే అంతకుముందు వారి మీదున్న సదభిప్రాయమంతా ఎలా మటుమాయం కాగలదా అని ఆలోచిస్తున్నాను."

"సుశీలా! ఇప్పు డేం జరిగిందని అలా బాధపడుతున్నావ్?" అన్న శేఖరం ప్రశ్నకు సమాధానంగా నేలమీద పడి ఉన్న ఉత్తరాన్ని తీసి అందించింది.

శేఖరం గబగబ ఉత్తరం విప్పాడు.

**మనిషైనా, దేవుడైనా పచ్చగా ఉన్నంతవరకే చల్లగా చూస్తారు ఎవరైనా. మనుష్యుల మంచితనాన్ని అర్థం చేసుకొనే సంస్కారం సంఘానికి ఇంకా అలవడ లేదేమో! తప్పు చేసినవారిని సంఘం క్షమించదు. క్షమించి ఆదరిస్తే సహించదు. పాడుపడిన గుడిని పునరుద్ధరించలేని సంఘం కష్టకాలంలో సాటి మనిషిని ఆదుకొంటుందా?**

'అక్కా!

ఇంటికి రమ్మని ఎన్నో ఉత్తరాలు రాశావు! కాని ఎలా రాగలను? నాకు మనస్సు లేదనుకొన్నావా? మానవసహజమైన బాధ, దుఃఖం నా మనస్సులోంచి ఉద్భవించవనుకొన్నావా? అయినా మనస్సుల నర్థం చేసుకొనే శక్తి నీ కెక్కడుంది? నీ కెంతవరకూ నీ మాటను నెగ్గించుకొని తమ్ముణ్ణి అదుపులో పెట్టాలనే పట్టుదల తప్ప, వాడి మనస్సు నర్థం చేసుకొని వాడి ఆశలను తీర్చాలనే ఉద్దేశమే లేదు. అందరూ నీలా కోర్కెలను చంపుకొని ఏదో పెద్ద త్యాగం చేశామనే తృప్తితో జీవించలేరు! చిన్నప్పట్నుంచీ నన్ను ఆదరించి, పెంచి పెద్దవాణ్ణి చేసి చదువు చెప్పించావ్! తల్లిదండ్రులు లేని లోటును తీర్చిన నీకు నా మనస్సులోని విషయాన్ని దాపరికం లేకుండా చెప్పుకొన్నాను. ఎందుకు? సహృదయంతో స్వీకరించి నన్ను, సరోజను ఆశీర్వదిస్తావనే ఆశతో. కాని, ఆ మాత్రపు సంస్కార హృదయం నీకు లేకపోయింది. నేను భాగ్యవంతులకు అల్లుణ్ణై నిన్ను మరిచిపోతానేమోనన్న భయం నిన్ను ఆవహించింది. చిన్నప్పట్నుంచీ పెంచిన అధికారాన్ని ఉపయోగించుకొని నన్ను శాసించాలనుకొన్నావు. నేను నిర్మించుకొన్న జీవనసౌధాలను నిర్దయతో కూల దోశావు! నీ ఆశీస్సులను పొందుదామనే ఆశతోనే సరోజను నీకు పరిచయం చేశాను. కాని, నీ మాటలతో ఆమె సున్నిత హృదయాన్ని గాయపరిచావు. ఆమె నన్ను అపార్థం చేసుకొంది! అక్క బుద్ధులు తమ్మునికి లేకుండా ఉంటాయా అని నాతో స్నేహం తెగతెంపులు చేసుకొంది. కొద్ది రోజుల్లోనే వేరొకణ్ణి వివాహం చేసుకొని అత్తవారింటికి వెళ్లబోతూంది. నా జీవితం ఎడారిపాలైంది! నాకు సుఖశాంతులు దూరమయ్యాయి. కాని, నీవు చేసిన సహాయాన్ని మరిచిపోయి కృతఘ్నుణ్ణి మాత్రం కాలేను! నీ ఋణాన్ని త్వరలోనే తీర్చుకొంటాను. కాని ఒక్క మాట! నీ తమ్ముడు ఏనాడో చనిపోయాడని మాత్రం గుర్తు పెట్టుకో! ఇప్పుడు మిగిలిందల్లా నీ దయా దాక్షిణ్యాల మీద పెరిగి పెద్దవాడైన ఓ అభాగ్యుడు మాత్రమే.— ఆనంద్.'

ఉత్తరం చదివిన శేఖరం కొన్ని క్షణాలపాటు నిశ్చేష్టుడయ్యాడు.

"సుశీలా! ఇక లాభం లేదు! అసలు విషయాన్ని ఆనంద్‌కు వెంటనే తెలియపరుస్తాను!"

"నా కిచ్చిన వాగ్దానాన్ని మరిచిపోతున్నావా, శేఖర్?"

"లేదు, సుశీలా! ఆ మాటకు కట్టుబడే ఇంతకాలం అసామాన్యమైన నీ త్యాగశీలతను, సహృదయతను ఆనంద్‌కు తెలియచెప్పలేకపోయాను. పరిస్థితులు విషమిస్తున్న ఈ సమయంలో నే నింక ఆ వాగ్దానానికి కట్టుబడి ఉండలేను. ఏ స్త్రీకూడా చేయలేని సాహసాన్ని తల పెట్టి ఆనంద్ భవిష్యత్తు కోసం నీ సుఖసంతోషాలను బలి చేసుకొన్నావు. దావాగ్నిలా రగులుతున్న అశాంతిని ఇంత కాలం నీ హృదయంలో దాచుకొన్నావు. ఇక ఆలస్యం చేస్తే లాభం లేదు! ఆనంద్‌కు నిజం తెలియాలి!"

"శేఖర్! ఇంత కాలం ఈ విషయాన్ని ఏ ఉద్దేశంతో రహస్యంగా ఉంచమన్నానో మరిచిపోయావా? తను ప్రేమించిన యువతి నా మూలంగా దూరమైపోయిందనే దిగులుతో బాధ పడుతున్న ఆనంద్ మనస్సు ఈ నగ్నసత్యాన్ని భరిస్తుందనుకొన్నావా? ఈ విషయం వాడికీ పరిస్థితుల్లో తెలిస్తే పిచ్చివాడై పోతాడు. నా మీద మరింత అసహ్యాన్ని పెంచుకొంటాడు."

"పొరపాటుగా ఆలోచిస్తున్నావ్, సుశీలా! నీ మీద వాడు ఏర్పరుచుకొన్న అనుమానాలు, అపోహలు తొలగి పోవాలంటే ఈ రహస్యం చెప్పక తప్పదు! నేను వెంటనే మద్రాసు వెళతాను."

"వద్దు, శేఖర్, వద్దు! నా మీద నీకే మాత్రం అభిమానం ఉన్నా అలా చేయటానికి సాహసించకు!" అంది సుశీల గద్గద స్వరంతో.

"సుశీలా! ఏమిటీ నిర్ణయం? ఎంత కాలం ఈ వ్యధను హృదయంలో దాచుకొంటావ్? నా మాట విను! ఆనంద్‌కు అసలు విషయం తెలియటం అన్ని విధాల మంచిది."

"శేఖర్! దయచేసి నా కేమీ చెప్పకు! నా మనస్సేమీ బాగాలేదు! నువ్విక్కణ్ణుంచి వెళ్ళిపో! నాకు విశ్రాంతి అవసరం" అంటూ రెండు చేతులతో తన కణతలను నొక్కి పట్టుకొని కళ్ళు మూసుకొంది సుశీల.

"సుశీలా! చేతులార మనస్సును పాడు చేసుకొంటున్నావ్! ఆనంద్ రాసిన ఉత్తరాన్ని గుర్తించే పదే పదే ఆలోచించకుండా విశ్రాంతి [illegible] నే వెళుతున్నాను!" అనేసి బయటకు వెళ్ళాడు శేఖరం.

సుశీల మెల్లగా వెళ్ళి తలుపు మూసేసింది.

కాని, మనస్సులో చెలరేగుతున్న తలపుల తలుపులను మాత్రం మూయలేకపోయింది.



'ఆ రోజు మద్రాసులో తనలా ఎందుకు ప్రవర్తించింది?

ఆనంద్ భాగ్యవంతులకు అల్లుడవుతాడనే ఈర్ష్యతోనా?

తన మాటను నిర్లక్ష్యపరుస్తాడనే భయంతోనా?

కావు!

అవేవీ కావు!

తన మనస్సులోని ఉద్దేశం వేరే ఉంది. సరోజను తనకు పరిచయం చేస్తూ ఆమె తలిదండ్రుల వివరాలను, ఆస్తిపాస్తులను ఆనంద్ తనకు చెపుతుంటే తన హృదయం తల్లడిల్లి తన ఆశ్చర్యాన్ని, ఆవేదనను రానీయకుండా మనస్సులోనే దాచటానికి ప్రయత్నించింది. సరోజ మంచి పిల్లే! కాని, ఆనంద్‌కు భార్య కాదగిన అర్హతలు కాదు! ఆమె

వంతుల బిడ్డ! తన జీవితం నాశనం కావటానికి మూలకారణమైన భాగ్యవంతుల బిడ్డ! పేదల మనస్సులతో ఆడుకొని క్షోభ పెట్టటమే వాళ్లకు తెలిసిన విద్య. వాళ్ల మనస్సుల నర్థం చేసుకొని ఆదరించ గలిగే ధైర్యసాహసాలు వారికి లేవు! ఆడపిల్ల మగవాళ్లతో విచ్చల విడిగా తిరగటం మంచిది కాదని, ఎవరి అంతస్తుల్లో వారు ఉండటం అందరికీ క్షేమకరమని, అమాయకుడైన తన ఆనంద్‌ను ఆకర్షించి మోసగించటం మంచిది కాదని సరోజ మనస్సు గాయపడేలా తను మాట్లాడింది. నిందలు, నిష్ఠూరాలు భరించవలసి వచ్చినప్పటికీ తను వారి స్నేహాన్ని అరికట్ట గలిగింది. ప్రస్తుతానికి ఆనంద్ తనను అపార్థం చేసుకొన్నా ఫర్వాలేదు. ఎప్పటికైనా నిజానిజాలు తెలియక పోవు! తన మనస్సును సరిగ్గా అర్థం చేసుకొనే తరుణం రాకపోదు! తొందరపడి తనను నిందించినందుకు ఆనంద్ పశ్చాత్తాపపడక మానడు!'

“సుశీలమ్మగారూ!” అన్న కేక వినిపించగానే ఆమె ఆలోచనలు ఆగిపోయాయి.

సుశీల వెళ్లి తలుపు తీసింది.

ఎదురుగా పేదరికానికి ప్రతినిధిగా నిలిచిన ఓ ఏభయ్యేళ్ల శరీరం కనిపించింది.

“సుశీలమ్మగారు మీరేనా?” వినయంగా అడిగాడు.

“అవును! ఏం కావాలి?”

“నా పేరు రంగడమ్మా! పిల్లలు గలోణ్ణి! మీరు రక్షించాలి!” దీనంగా అడిగాడు.

“ఏం జరిగింది?” ఆత్రంగా అడిగింది.

“మీ షెడ్డులో ఈ వేళే ఓ బండిని కిరాయికి తీసుకొన్నానమ్మా! అది లారీని గుద్దుకొని ఓ చక్రం బాగా దెబ్బ తిని పోయింది. మీ గుమాస్తాగారు కొత్త చక్రానికి డబ్బులు కట్టమంటున్నాడు. నేను పేదోణ్ణి, తల్లీ! రిక్షా తొక్కుకొని బతికే వాణ్ణి! ఇప్పు డొక్కసారే అంత డబ్బు కట్టాలంటే నా పెళ్లాం బిడ్డలు పస్తులుండాలి, తల్లీ! నా కష్టాన్ని మీకు చెప్పుకొందామని వచ్చాను. మీరు కరుణించాలి!” అంటూ రెండు చేతులు జోడించి ప్రాధేయపడ్డాడు రంగడు.

సుశీల రెండు క్షణాలు ఆలోచించి, “సరే! నేను చెప్పానని చెప్పు ఆ గుమాస్తాకు! ఇకముందైనా కొంచెం జాగ్రత్తగా ఉండు!” అంది సుశీల.

“అలాగేనమ్మా! చల్లని తల్లీ! దండాలు!” అంటూ ఎంతో సంబరపడుతూ వెళ్లిపోతున్న రంగడి వైపు చూస్తూ ఉండిపోయింది సుశీల.

* * *

“అమ్మా! సుశీలమ్మా! ఏం చేస్తున్నావ్?” అంటూ లోపలికి వచ్చింది నారాయణమ్మగారు.

పరధ్యానంగా కూర్చొన్న సుశీల లేచి నిలబడి, “అబ్బే! ఏమీ లేదండి, పిన్నిగారూ! లోపలికి రండి!” అంటూ ఆహ్వానించింది.

“అదేమిటమ్మా! గుడికి వేళయితే ఇంకా తయారుకాలేదే?”

“ఈ వేళ రావాలని లేదు, పిన్నిగారూ!”

“రావాలని లేదా? ఈ వేళ శనివారమమ్మా! అదీగాక ఈ రోజు స్వామివారిని సర్వాభరణాలతో అలంకరించి పూజలు చేస్తారు. ఆ విషయం మరిచిపోయావా? ఆ స్వామి రూపాన్ని చూసి తరించటానికి ఎంతోమంది భక్తులు వస్తారు. నీవు త్వరగా తయారై ఉండు! నే నిప్పుడే వస్తా!” అంటూ ఆజ్ఞాపించి తన ఇంట్లోకి వెళ్లిపోయింది నారాయణమ్మగారు.

వయస్సులో సుశీలకంటె పెద్దదయినప్పటికీ, ఆ ఇంట్లోకి అద్దెకు వచ్చినప్పట్నుంచీ నారాయణమ్మగారు సుశీలకు గొప్ప స్నేహితురాలైంది. ఒక్కగానొక్క కొడుక్కి పెళ్లి చేసేసి తను కృష్ణా, రామా అంటూ కాలం వెళ్లబుచ్చుతూంది ఆవిడ! రోల్డుగోల్డు వ్యాపారం చేసి సంపాదిస్తున్నదంతా తన కొడుకు వ్యసనాలకే ఖర్చయిపోవటం నారాయణమ్మగారిని ఎప్పుడూ బాధించేది. తమ ఇంట్లో మిగిలిన రెండు భాగాలను అద్దెకిచ్చింది. తాము ఉంటున్న భాగానికి అవతలివైపు ఓ బడిపంతులికిచ్చింది. ఇవతలవైపున్న వాటాను సుశీలకిచ్చింది. ఇల్లు అద్దెకివ్వటం ఆమె కొడుకైన భూషణానికి ఇష్టంలేకపోయినా కోడలికి మాత్రం ఇష్టమైంది. పెళ్లాం కూడా తల్లి ఉద్దేశాన్ని బలపరిచేసరికి భూషణం మాట్లాడలేక అద్దె కివ్వటానికి ఒప్పుకొన్నాడు. సుశీల సౌమ్య స్వభావం ఆకర్షించటంచేతనైతేనేమి, తనకు కూతుళ్లు లేకపోయిన కారణంచేతనైతేనేమి సుశీల అంటే అమితమైన అభిమానాన్ని, వాత్సల్యాన్ని పెంచుకొంది నారాయణమ్మగారు. సుశీలకు కూడా ఆవిడంటే ఎనలేని గౌరవం. మనస్సులో వెళ్లాలని లేకపోయినప్పటికీ ఆవిడ మాటను కాదనలేక దేవాలయానికి బయలుదేరింది సుశీల.

వాళ్లిద్దరూ వెళ్లేసరికే దేవాలయమంతా భక్తులతో కళకళ లాడుతూంది! ఇద్దరూ కోనేట్లో కాళ్లు కడుక్కొని, గర్భగుడి చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణం చేశారు. సర్వాభరణాలను ధరించిన స్వామిని మనసార ప్రార్థిస్తూ తాము తెచ్చిన పూలను, పళ్లను సమర్పించారు. రోజూ చూసే దేవుడైనప్పటికీ ఆ రోజు ఆ స్వామి ముఖంలో నూతన తేజం విరాజిల్లుతూంది! విగ్రహం నిండా అలంకరించిన బంగారపు నగలు, వాటిలో పొదగబడిన రాళ్లు నియోన్‌లైట్ల వెలుగులో వింత కాంతుల నీనుతూ తళుక్కున మెరుస్తున్నాయి. ఆ రోజు దేవుడు భాగ్యవంతుడు కావటంచేత కాబోలు దర్శనం చేసుకోవటానికి వచ్చే భక్తుల సంఖ్య, వారు తెచ్చే కానుకల సంఖ్య పెరిగాయి.

జవాబు తప్పించుకొంటూ నారాయణమ్మగారు, సుశీల కళ్యాణమండపం దగ్గరకు వెళ్లారు. అక్కడ శాస్త్రిగారు ‘కర్ణరహస్యం’ అనే హరికథను శ్రావ్యంగా గానం చేస్తున్నారు. నారాయణమ్మగారు ఓ స్తంభం పక్కన కూర్చుంటూ సుశీలనుకూడా కూర్చోమంది. శాస్త్రిగారు చెపుతున్న గాథను అత్యంత ఆసక్తితో వింటూ ఆయన గానానికి ముగ్ధులై పోతున్నారు భక్తులు. ముఖ్యంగా కుంతీదేవి మానసిక సంక్షోభాన్ని హృదయానికి హత్తుకొనేలా చెపుతున్నారు శాస్త్రిగారు. సుశీలకు మాత్రం హరికథను వినాలనిపించటం లేదు. తనో ముళ్లపాన్పు మీద కూర్చున్నట్లు బాధపడింది. పది నిమిషాలు గడిచాక తనకు తలనొప్పిగా ఉందని నారాయణమ్మగారితో చెప్పేసి ఆలయ ప్రాంగణంలోంచి బయటకు వచ్చింది.

అదే రోడ్డుమీద ఓ అరవై గజాల దూరంలో ఉన్న మరో దేవాలయాన్ని సమీపించగానే సుశీల తక్కున ఆగిపోయింది. అయితే అది పేరుకు మాత్రమే దేవాలయంగా మిగిలింది. దాన్ని ఆరాధించే భక్తులుగాని, ఆదరించే దాతలు గాని ఎవ్వరూ లేరనే చెప్పాలి. కాని అటువేపు వెళ్లినప్పుడల్లా లోపలి కెళ్లి ఆ కోవెలలో నామమాత్రంగా నిలిచిపోయిన దేవి విగ్రహానికి నమస్కరించటం సుశీలకు అలవాటయిపోయింది. కాళ్ల కున్న చెప్పులను బయటే విడిచి లోపలి కెళ్లి దేవికి భక్తితో నమస్కారం చేసింది.

అమ్మవారి విగ్రహానికి పట్టిన దుస్థితిని చూస్తుంటే సుశీల హృదయం తరుక్కుపోయింది. ఒకప్పటి ఆ కోవెల వైభవమంతా కళ్లముందు మెదిలింది.

‘తన చిన్నతనమంతా ఈ ఊళ్లోనే, తాతయ్య వద్దనే గడవటంచేత అప్పటి కోవెల రూపం తనకు చూచాయగా గుర్తుంది. ఆ రోజుల్లో అమ్మవారి కోవెల భక్తులతో కళకళలాడుతుండేది. అమ్మవారి ఒంటినిండా పట్టుపీతాంబరాలు కట్టబడి ఉండేవి. ఉత్సవాలు జరిగే సమయంలో అమ్మవారిని రోజుకో రకంగా అలంకరించి, ఓ రోజు పెట్టిన నగలను మరో రోజు పెట్టకుండా వారం రోజుల పాటు వైభవంగా జరిపేవారు. చందన, సుగంధాది పరిమళాలతో దేవీవిగ్రహం నిత్యమూ విరాజిల్లుతుండేది. నిత్య నైవేద్యాలు, పూజాపునస్కారాలు—ఎంతో వేడుకగా జరిగేవి! ఉత్సవాల సందర్భంలో ఆమె దర్శనం దొరకటమే కష్టమైపోయేది. ఎన్నో గంటలసేపు నిరీక్షించి, ఆ దివ్యసుందర రూపానికి భక్తితో ప్రణమిల్లేవారు భక్తులు.

అలాంటి దేవికి ఈ నాడు ఇలాంటి దుస్థితి పట్టింది. విగ్రహం మీదున్న దుమ్మును, ధూళిని శుభ్రం చేయటానికి కూడా ఎవ్వరూ పూనుకోలేక పోతున్నారు. ఒకప్పుడు భక్తుల పాదాలను తాకిన కోనేరు, ఈనాడు చెత్తబుట్టలకు,



పగిలిన కుండలకు, పనికిరాని వస్తువులకు ఆశ్రయాన్నిచ్చింది.

ఒకప్పుడు ఎంతోమందిచేత ఆదరించబడి, ఆరాధించబడిన ఆ దేవికి ఇలాంటి పరిస్థితి ఎందుకు కలిగింది?

భ్రష్టే లవబడే పెద్దమనుష్యులు దేవిని అనహాయురాల్ని చేసి దోచుకొన్నారు. పేదరికంతో బాధపడుతూ, పేలవంగా చూస్తున్న దేవిపట్ల ప్రజలు పూర్వంలా తమ భక్తిని ప్రకటించుకోలేకపోతున్నారు. ఎవాడైతే ఆ దేవి వైభవం అంతరించిందో ఆ నాడే ఆ దేవి కోవెలను వదిలేసి వెళ్లిపోయిందని, ప్రస్తుతం మిగిలింది నిర్జీవమైన ఓ పాషాణమేనని చాలామంది అభిప్రాయపడుతున్నారు. మనుష్యులు ఆదరించకపోయినా ఆ దేవిని ఆరాధించే పక్షులు, ఆశ్రయించిన గబ్బిలాలు, సాలీళ్ల



ఎన్నో ఉన్నాయి. ఒకప్పుడు రంగురంగుల దీపాలతో అలంకరించబడి దేదీప్యమానంగా కనిపించిన గాలిగోపురం ఈ నాడు పక్షులకు నివాస స్థలమైంది. ఆ పక్షుల కిలకిలారావాలే ఆ దేవికి మేలుకొలుపు లయ్యాయి. ఆ దేవి ఇంకా నామమాత్రంగానైనా అలా నిలిచి ఉన్నదంటే అందుకు కారణం ఆ పక్షుల భక్తికి కట్టుబడే కావచ్చు!

అలా ఆలోచిస్తూనే సుశీల గుళ్లోంచి బయటకు వచ్చింది.

మౌనంగా అడుగులు వేసుకొంటూ ఫుట్‌పాత్‌మీద నడుస్తున్న సుశీలకు వెనకనించి ఏవో వెకిలినవ్వులు వినిపించాయి.

వెంటనే వెనక్కి తిరిగి చూసింది!

ఓ నలుగురు కాలేజీ కుర్రాళ్లు తన వైపే చూస్తూ నవ్వటం గమనించింది. పటుక్కున తల తిప్పుకొంది.

"చూశావా, గురూ, మన వేణుగాడి పిన్నిని!"

"వేణుగాడి పిన్నా? అంటే. . . ఓహోహో! తెలిసింది, గురూ! పిచ్చోడిలా ఉంటాడుకాని, శేఖరం దేవాంతకుడే నన్న మాట!"

"చింత చచ్చినా పులుపు చావలేదు రోయ్!"

మళ్లీ వెకిలినవ్వులు.

వాళ్ల మాటలు వాడి సూదుల్లా వచ్చి సుశీల హృదయాన్ని గాయపరిచాయి.

వాళ్ల నవ్వులు తేళ్లుగా మారి ఆమె శరీరంమీద ప్రాకినట్లయింది. యాంత్రికంగా అడుగులు వేసుకొంటూ ఇల్లు చేరుకొని మంచంమీద వాలి పోయింది.

'దేవునిలాంటి శేఖరాన్ని గురించి ఈ గుడ్డిలోకం ఇంత నీచంగా ఆలోచిస్తూందా?

నేడు తనిలా బ్రతుకుతున్నదంటే అందుకు కారణం ఆ మహానుభావుని కరుణే! అతని నిర్మలమైన మనస్సు తనకు బ్రతుకుబాటను చూపించింది! గతి తప్పి తిరుగుతున్న గ్రహంలాంటి తనను ఋజుమార్గంలో పెట్టి తన జీవితానికి ఓ గమ్యాన్ని, లక్ష్యాన్ని ఏర్పరిచిన సహృదయు డతను!

శేఖరం, తను చిన్నప్పట్నుంచీ చాలా కాలంపాటు ఒకేచోట పెరిగారు! థర్డ్ ఫారమ్ వరకు ఇద్దరూ ఒకే స్కూల్లో కలిసి చదువుకొన్నారు. చిన్నప్పుడే తల్లి తండ్రులకు దూరమైన తను తాతయ్య సంరక్షణలో పెరిగింది. మిఠాయి కార్ఖానాలో పని చేస్తూ తనను చదివించాడు తాతయ్య. ఆయన పెంపకంలో తన కే దిగులూ లేకుండా రోజులు గడిచి పోయాయి. తాతయ్య మరణంతో తన జీవితంలో సమస్యలు ప్రారంభమయ్యాయి. ఒక్కగానొక్క ఆధారమైన బాబాయి వచ్చి తనను వాళ్ల ఊరికి తీసుకెళ్లాడు. కాని, అక్కడ తన కేమాత్రం సుఖం కనిపించలేదు. తనను బానిసకంటె హీనంగా చూసేది పిన్ని. ఆమె అనే సూటిపోటి మాటల్ని, ఆమె పెట్టే బాధలను తను అతి కష్టంమీద భరించింది. మొదట్నుంచీ పేదరికంలో పుట్టి పెరగటం చేత ఆడంబరాలంటే తన కో విధమైన ఆకర్షణ ఉండేది. సినిమాల్లోలా తనను ఓ ధనవంతుల బిడ్డ ప్రేమించి పెళ్లి చేసుకొంటే బాగుండునని పగటి కలలను కనేది! తన ఊహల కనుగుణంగానే తన అందచందాలు యువ హృదయాలను మత్తు గొల్పేవి! తన బాబాయిగారింటి పక్కనే అద్దెకుంటున్న వాసు తన దృష్టిని ఆకర్షించాడు. అతనుకూడా తన ఆకర్షణకు లొంగిపోయాడన్న సంగతి చాలా తేలిగ్గా పసిగట్ట గలిగింది తను! అవకాశం దొరికినప్పుడల్లా తామిద్దరూ మాట్లాడు కొనేవాళ్లు! రోజులు గడుస్తున్నకొద్దీ తన మనస్సు బలహీనమైంది. ఏవేవో కోర్కెలు తీర్చుకోవాలనే తపన, ఆరాటం తనలో అధికమయ్యాయి. ఫలితంగా, బి. ఎ. పరీక్షలు రాసిన వాసు తనను వాళ్ల ఊరికి తీసుకెళ్లి పెళ్లి చేసుకొంటా నని చెప్పి మద్రాసు తీసుకెళ్లాడు. అతను తనను పెళ్లి చేసుకొంటాడనే విశ్వాసంతో ఎన్నో మధురమైన క్షణాలు అతని కోసం త్యాగం చేసింది తన వయస్సు. తెగింపు అనేది ఉంటే మనిషికి ఆనందం ఎప్పుడూ చేరువలోనే ఉంటుందని ఎంతో మురిసిపోయింది తను! ఓ రాత్రికి రాత్రే వాసు తనను మోసగించి హోటల్లో వదిలేసి పారిపోయేవరకు తనలో ఆ భావం అలానే ఉండిపోయింది. ఆ హోటల్లోంచి బయటపడి మొట్టమొదటి సారిగా ఈ విశాల ప్రపంచంలోకి బ్రతుకుతెరువు కోసం బయలుదేరింది తను! బాబాయి దగ్గరకు తిరిగి వెళ్లాలనే తలంపే తనకు కలగలేదు! ఎందుకంటే, కాలు జారిన కన్యను ఆదరించగలిగే సహృదయత తన బాబాయికి లేదన్న విషయం తనకు తెలుసు. బ్రతుకుతెరువు కోసం తను ఎన్నో చోట్ల తిరిగింది. అందరూ తన అందాన్ని ఆస్వాదించి సర్వనాశనం చేయాలనే తలంపుగలవాళ్లేకాని తన నిస్సహాయ పరిస్థితిని అర్థం చేసుకొని ఆదరించే వాళ్లు కనిపించ లేదు. ఆకలి తీర్చుకోవటానికి ఓ పట్టెడన్నంకూడా సంపాదించుకోలేని దుర్గతి పట్టింది తనకు. నీరసంగా, నిస్సత్తువగా నడుస్తున్న తను కళ్లు తిరిగి ఓ రోడ్డు మధ్యగా పడిపోయింది. కళ్లు తెరిచిన కొద్ది క్షణాలకే తనొక వేశ్యాగృహంలో ఉన్నానన్న సంగతి తెలిసింది. ఆ ఇల్లే తనకు ఆరేళ్ల పాటు ఆశ్రయాన్నిచ్చింది. అక్కడ తను అనుభవించిన నరకాన్ని తలుచుకొంటుంటే తనమీదే కాదు, ఈ మానవజాతిమీదే అసహ్యం కలుగుతూంది! ఆడదాన్ని ఆటవస్తువుగా భావించి అధఃపాతాళానికి అణగదొక్కి వేయటానికి ప్రయత్నించేపురుషజాతం టేఅప్పట్నుంచీ తనకు పగ ఏర్పడింది. తను లోకం దృష్టిలో పతిత! కులట! వ్యభిచారిణి! ఇలాంటి బిరుదుల నెన్నింటినో ఇచ్చింది ఈ సంఘం. కాని, ఆ నరకంలో కొట్టుకొంటున్న వారిని సంస్కరించి సరియైన మార్గాన పెట్టి వారి జీవితాలను స్వర్గతుల్యం చేయగల సాహసం లేదు ఈ సంఘానికి. ప్రత్యక్షంగా సుఖం కావాలని ప్రాధేయపడిన పురుషుడే పరోక్షంగా 'ఛీ! కులట!' అని చీదరించుకొంటాడు. తన అందానికి ఎంతోమంది దాసులయ్యారు. పగలంతా స్త్రీజనోద్ధరణ అని ప్రసంగాలు చేసిన పెద్దమనుష్యులెంతోమంది తన పొందుకోసం ఆరాటపడ్డారు. చివరకు తను ఆ నరకకూపంలో దిగటానికి మూలకారకుడైన వాసుకూడా తన అందచందాలను గురించి విని తన కోసం వచ్చాడు.

తనను సర్వనాశనం చేసిన వ్యక్తి తిరిగి వచ్చినందుకు సంతోషించాలా, విచారించాలా అనే విషయం గురించి తను అంతగా ఆలోచించలేదు! తను తప్పటడుగు వేయటానికి కారణం అత

నొక్కడే కాదు! అతని లాంటివాళ్ల కెంతో మందికి ఆశ్రయా న్నిచ్చిన ఈ సంఘమే తన పతనానికి కారణం! నాను తనను గుర్తించాడు. తన పరిస్థితికి చాలా విచారించాడు. తనకు పెళ్లయిందని, పెళ్ళాం ప్రసవించటానికి పుట్టింటికి వెళ్లిందని, తను లా పాసయి ప్రాక్టీసు చేస్తున్నానని తన గురించి వివరంగా తనకు చెప్పుకొన్నాడు. ఆ సమయంలో అతనివద్ద నుంచి తనేమీ ఆశించలేదు! ఎందుకంటే, నాను జీవితంలో మళ్లీ ప్రవేశించి మరి కొందరి జీవితాలను నాశనం చేయటం తన కిష్టం లేదు. నాను దగ్గర తనేమీ మాట్లాడలేదు. నాను వెళ్లిపోయాడు. అప్పట్నుంచీ మళ్లీ తన దగ్గరి కెప్పుడూ రాలేదు. అలా వచ్చే ధైర్యం అతనికి లేదని తనకు తెలుసు! తరవాత కొంత కాలానికి అతనో కేసును వాదిస్తూ కోర్టులోనే గుండెపోటుతో మరణించా నన్న వార్తను, అతని ఫోటోను తను పేపర్లో చూసింది. ఆ వార్త తెలిశాక తనకు దుఃఖం ఆగలేదు!. . .'

తలుపు కొట్టిన చప్పుడయ్యే సరికి సుశీల ఉలిక్కి పడి లేచింది.

"ఏమమ్మా! తల నొప్పి తగ్గిందా? ఒంట్లో ఎలా ఉంది?" అని పరామర్శిం చింది నారాయణమ్మగారు.

"తగ్గింది, పిన్నిగారూ! ఇప్పుడు కులాసాగానే ఉంది" అంది సుశీల.

"జాగ్రత్తగా విశ్రాంతి తీసుకో, అమ్మా!" అనేసి తను ఇంట్లోకి వెళ్లి పోయిం దావిడ.

సుశీల వచ్చి మంచంమీద కూర్చుంది.

పక్కవాటాలోంచి బిగ్గరగా వినిపి స్తున్న మాటలు విని నిశ్చేష్టురాలైంది!

"ఏ కెన్ని సార్లు చెప్పానమ్మా గుడి కెళ్లనద్దని! అంతగా పూజ చేసుకోవాల నుంటే ఇంట్లోనే చేసుకోరాదూ?" భూషణం కంఠం.

"ఇప్పుడేమైందని అలా అరుస్తావ్?" నారాయణమ్మగారి ప్రశ్న.

"ఇంకేమవ్వాలి? నా మాటను పెడ చెవిని పెట్టి అద్దమైన వాళ్లందరికీ మనింటిని అద్దె కిచ్చావ్! అంతటితో ఆగకుండా ఆ చెడిపోయినదాన్ని వెంటేసు కొని బజార్లవెంట తిరుగుతున్నావ్! ఆ కులట గురించి లోకులంతా ఎంత అసహ్యంగా చెప్పుకొంటున్నారో తెలుసా? దీనికి తోడు ఆ శేఖరంగా డొకడు! పెళ్లాం బిడ్డలున్న వాడి కివేం బుద్ధులు? ఛీ! ఛీ! వ్యభిచారుల కొంపయి పోయింది."

సుశీల ఇక వినలేక రెండు చేతులతో చెవులను మూసుకొంది. కాళ్లక్రిందున్న భూమి గిర్రున తిరిగినట్లయింది!

అపవాదులూ [illegible]గిపోయాయి!

ఏదో ఎత్తైన శిఖరంమీద నుంచి అగాధంలోకి విసిరినట్లయింది! శరీరంలోని అవయవాలన్నీ పట్టుతప్పి కుప్పలా కూలిపోయింది.

రిక్షా షెడ్డు తాళంచేతులను ఇవ్వ టానికి వచ్చిన గుమాస్తా ఆ దృశ్యాన్ని చూసి కంగారుపడి పక్క వాటాలోకి పరుగెత్తాడు.

నారాయణమ్మగారు వచ్చి సుశీలముఖం మీద నీళ్లు చల్లి శేఖరం కోసం కబురు చేసింది.

శేఖరం వస్తూనే డాక్టర్‌ను వెంట బెట్టుకొని వచ్చాడు.

సుశీలను పరీక్షించాక బి. పి. ఉందని, ఆమె మానసికంగా చాలా బాధ పడుతూ ఉందని, విశ్రాంతి అవసరమని చెప్పాడు డాక్టర్.

నీవు నిందలపాలు కావటం నా కిష్టం లేదు!"

"సుశీలా! ఏమిటి నువ్వంటున్నది?" ఆశ్చర్యంగా అడిగాడు శేఖరం.

"మనుష్యుల మంచితనాన్ని అర్థం చేసుకొనే సంస్కారం ఇంకా ఈ సంఘానికి అలవడలేదు!"

"ఈ సంఘాన్ని చూసి భయపడు తున్నావా, సుశీలా?"

"లేదు, శేఖర్! సంఘమంటే భయ పడే క్షణాలు పోయి ఎన్నో సంవత్సరాలు గడిచాయి! నేను బాధపడేది నా గురించి కాదు! నీ గురించి! వేలెత్తి చూపించే అవకాశం ఈ లోకులకు మనం ఇవ్వ కూడదు! దయచేసి వెళ్లిపో!" అంది సుశీల బాధగా.

"చిన్ననాటి సంఘటనలు మరిచి పోయావా, సుశీలా? స్కూల్లో తోటి

జీవితం ఆ నరకంలోనే మగ్గిపోయేది! చీకట్లో ప్రయాణం చేస్తున్న నాకు వెలుగు చూపించావు నీవు! నా జీవితానికి ఓ లక్ష్యాన్ని నిర్ణయించి, స్వయంశక్తి మీద నేను జీవించటానికి సహాయ పడ్డావు! నీ లాంటి నిర్మల హృదయుని పై ఈ లోకం నిందలు మోపుతుంటే నేను సహించలేను, శేఖర్!"

"సుశీలా! అనవసరమైన ఆలోచన లతో మనస్సు పాడు చేసుకోకు! విశ్రాంతి తీసుకో!"

"హుఁ. . . విశ్రాంతి! ఏ నాడో తీసుకోవలసింది! ఇప్పటికే చాలా ఆలస్య మైంది."

"సుశీలా! ఏమి టా మాటలు?"

"నేను ఆత్మహత్య చేసుకొంటానని భయపడుతున్నావా, శేఖర్? అంత పిరికి దాన్నయితే నాను నన్ను మోసగించిన



[illegible]

నారాయణమ్మగారికి ఆ పరిస్థితుల్లో సుశీలను వదిలిపెట్టి వెళ్ల బుద్ధి కాలేదు. కాని, అప్పటికే కొడుకు మూడు, నాలుగు సార్లు రమ్మని కేక వేయటంతో ఆమెకు వెళ్లక తప్పలేదు.

దిగులుగా కుర్చీలో కూర్చున్న శేఖరం ముఖంలోకి చూస్తూ, "శేఖర్, నువ్వుకూడా వెళ్లిపో!" అంది సుశీల మెల్లగా.

"ఈ పరిస్థితుల్లో నిన్ను వదిలి వెళ్లటమా?"

"నే నిప్పుడు బాగానే ఉన్నానుగా! నీ కోసం మీ వాళ్లంతా ఎదురు చూస్తుం టారు."

శేఖరం మాట్లాడలేదు.

"శేఖర్! ఈ లోకుల సంగతి నీకూ తెలుసు! వాళ్ల మాటలను నిర్లక్ష్యపరిచే ఆత్మబలం నీకుంది! కాని నా మూలంగా

విద్యార్థులతో నిన్ను నా చెల్లెలని ఎంత గర్వంగా చెప్పుకొనేవాణ్ణో గుర్తు లేదా? ఆ నాటి పవిత్ర అనుబంధమే ఈ నాటివరకు మనల్ని ఆత్మీయులనుగా మిగిల్చింది, సుశీలా!"

"కాని, ఈ లోకం ఎప్పుడూ మంచిని వినిపించుకోదు, శేఖర్! అపవాదులకు, అక్రమాలకు ఈ లోకంలో ఆదరణ ఎక్కువ! చెడు మార్గంలో నేను తిరిగి నంతకాలం నన్నాదరించి విమర్శించే ధైర్యం లేకపోయిం దీ సంఘానికి! నీ స్నేహ వాత్సల్యం చేత మాతన జీవితాన్ని ప్రారం భించి మంచి మార్గాన ప్రవేశించిన నన్ను ఈ సంఘం దూషిస్తూంది. గతంలో నేను చేసిన పాపాలు నా కిప్పుడు అంటుగడుతూంది! వ్యాపార రీత్యా నీవు మద్రాసు వచ్చి నన్ను కలుసుకొని ఉండకపోయినట్లయితే నా

నాడే ఆ పని చేసి ఉండేదాన్ని! నా గురించి ఆందోళనపడకు! వెళ్లిపో!"

"అనవసరంగా గతాన్ని తవ్వుకొని బాధ పడనని మాటిస్తేగాని నేను ఇక్క ణ్ణుంచి కదలను!" అన్నాడు శేఖరం.

"అలాగే, శేఖర్!" అంది సుశీల పేలవంగా నవ్వుతూ.

"సరే, నే వస్తా!" అంటూ శేఖరం బయటకు వచ్చాడు.

ఆనంద్‌ను వెంటనే పిలిపించి, నిజా నిజాలు అతనికి తెలియజేసి, సుశీలకు హృదయావేదనను తగ్గించటం అవసర మని భావించి టెలిగ్రాఫ్ ఆఫీసు వైపు నడిచాడు శేఖరం.

• • •

అకస్మాత్తుగా మద్రాసు వచ్చిన శేఖ రాన్ని చూడగానే ఆనంద్ ఆశ్చర్య పోయాడు.



పాలంనుంచి

ఫోటో— యు. జి. రజ్‌పుత్ (కొల్హాపూర్)

"ఆనంద్! ఏమిటి, బాబూ, ఈ నిర్లక్ష్యం? సుశీల ప్రాణాపాయ స్థితిలో ఉందని రెండు టెలిగ్రాములు ఇచ్చినా కూడా నీ విక్కడ నిశ్చింతగా ఉన్నావా? ఆమె మనస్సు నెందు కిలా హింసిస్తున్నావ్?"

"శేఖరంగారూ! మా అనుబంధం ఏనాడో తెగిపోయింది."

"నీ వనుకొన్నంత త్వరగా తెగిపోయే బంధం కాదు, బాబూ!"

"మీ రసలు ఇక్కడి కెందుకొచ్చారు? ఈ నాడు మా కీ స్థితిని కల్పించటానికి మూలకారకులు మీరు! మా అక్క జీవితంలో ప్రవేశించి లోకమంతా ఆమెను అసహ్యించుకొనేట్లు చేశారు. ఆమెను కీలుబొమ్మను చేసి నా సరోజను నాకు దూరం చేయించారు."

"ఆనంద్! ఇక మాట్లాడకు! నీ వింత సంకుచిత హృదయు మనుకోలేదు. నీ సుఖం కోసం, నీ భవిష్యత్తు కోసం తన సుఖాన్నికూడా బలి చేసిన ఆ పుణ్యమూర్తినిఅనుమానిస్తున్నావా?"అంటూ ఆవేశంగా అన్నాడు శేఖరం.

ఆనంద్ మారు మాట్లాడకుండా తన గదిలోకి వెళ్లి కొన్ని పాత ఉత్తరాలను తీసుకొచ్చి శేఖరానికిచ్చి, "వీటి కర్థం చెప్పండి" అన్నాడు.

ఆ ఉత్తరాలను చదివిన శేఖరం నిర్విణ్ణుడయ్యాడు!

"ఆనంద్! ఈ తప్పుడు రాతలను నమ్మకు, బాబూ! వీటి వెనక దాగున్న కుట్ర నీకు తెలియదు. ఈ భూషణం నా మీద ఎప్పట్నుంచో పగ బట్టాడు! రోల్డుగోల్డు వ్యాపారంలో నన్ను దెబ్బ తియ్యాలని ఎన్నోవిధాల ప్రయత్నించి విఫలుడై, చివరకు ఈ దుర్మార్గానికి పాల్పడ్డాడు. సుశీల నాకు చెల్లెలు బాబూ! చిన్నప్పట్నుంచీ మే మిద్దరం తోబుట్టువుల లాగే పెరిగాం! అన్నా చెల్లెళ్లగానే మా అనుబంధం ఈనాటివరకు నిలిచింది. ఆ అనుబంధం,అభిమానంనన్నుఅశక్తుణ్ణి చేసి, అసలు రహస్యాన్ని నీ కింతవరకు చెప్పించలేకపోయాయి. ఆ రహస్యాన్ని ఇంతకాలం దాయటం చేతనే ఈ అపోహలు, అపార్థాలు ఏర్పడ్డాయి. ఇక అసలు విషయాన్ని దాచలేను, ఆనంద్!" అన్నాడు శేఖరం, ఆనంద్ చేతులు పుచ్చుకొని.

"శేఖరంగారూ! ఏమిటి మీ రనేది?"

"నీ స్నేహితురాలైన సరోజ తండ్రి లాయర్ వాసుదేవరావు. . ."

"చెప్పండి, శేఖరంగారూ, చెప్పండి!" ఆత్రంగా అడిగాడు ఆనంద్.

"నీకు జన్మ నిచ్చిన తండ్రి."

"శేఖరంగారూ!" గట్టిగా అరిచాడు ఆనంద్.

"ఇంతకాలం నీవు అక్కగా భావిస్తున్న సుశీల నీకు జన్మనిచ్చిన తల్లి!"

"శేఖరంగారూ! నా కిక చెప్పకండి! మీరు చెప్పినదంతా అబద్ధమని ఒక్కసారి చెప్పండి!" అంటూ జుట్టంతా చేతులతో చిందర వందర చేసుకొంటూ పిచ్చి పిచ్చిగా అరిచాడు ఆనంద్.

శేఖరం ఆనంద్ భుజంమీద చేయి వేసి ఓదార్పుగా— "ఆనంద్! కొన్ని నిజాలు వినటానికి చాలా భయంకరంగానే ఉంటాయి! కాని గుండె రాయి చేసుకోవాలి! నీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నీకు మచ్చ రాకూడదనే ఉద్దేశంతో నిన్ను లోకం దృష్టిలో సోదరుడుగా పెంచింది.మమతలనుతెంచుకొనిదూరంగా ఉండటం కష్టమైనప్పటికీ నీ శ్రేయస్సు కోరి నిన్ను మద్రాసులో ఉంచి, చదివించి ప్రయోజకుణ్ణి చేసింది."

"శేఖరంగారూ! ఇంతకాలం ఈ రహస్యాన్ని నా కెందుకు చెప్పలేదు? కన్నతల్లిని 'అక్కా' అని పిలుస్తుంటే మీ హృదయం ఎలా సహించింది? ఆ త్యాగమూర్తిని 'అమ్మా!' అని పిలిచే అర్హతను పోగొట్టుకొన్నాను! నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు!" అంటూ చిన్న పిల్లవానిలా ఏడుస్తున్న ఆనంద్‌ను ఓదార్చటానికి ప్రయత్నించాడు శేఖరం.

"ఆనంద్! జరిగిం దేదో జరిగిపోయింది! సుశీల పరిస్థితి ఏమీ బాగా లేకపోవటంచేత నర్సింగ్‌హోమ్‌లో చేర్పించాను. ఇది ఆలస్యం చేయటానికి సమయం కాదు! వెంటనే మనం బయలుదేరాలి!" అంటూ అతన్ని ప్రయాణానికిసుముఖుణ్ణి చేశాడు.

• • •

దేవి వారి కోవెల దగ్గరకు వచ్చేసరికి రిక్షా ఆగిపోయింది.

రోడ్డంతా జనంతో నిండి ఉంది.

"ఏం జరిగింది? ఆ జనం ఏమిటి?" అని అడిగాడు రిక్షాలో కూర్చున్న ఆనంద్.

"రాత్రేసిన గాలికి గోపురం కూలిపోయింది, బాబూ!" రిక్షా రంగడు సమాధానం చెప్పాడు.

"అటు వెళ్లటం కష్టం లాగుంది. రిక్షాను వెనక్కి తిప్పి పక్క సందులోంచి పోనియ్!" అన్నాడు శేఖరం.

"అలాగే, బాబూ!" అంటూ రిక్షాను వెనక్కు తిప్పాడు రంగడు.

"ఏమిటో, బాబూ, ఈ మడుసుల బుద్ధులు గమ్మత్తుగుంటాయి. కూలిపోతాదని తెలిసికూడా నిన్నటి దాకా దాని సంగతెవడూ పట్టిచ్చుకోలేదు. ఇయ్యాళ సూడండి! ప్రతోడు 'అయ్యో, పాపం' అంటున్నాడు. ఇది బలే ఇంత కాలం, బాబూ! మడిసికి, దేముడికి తేడా లేదు! మడిసినైనా, దేముణ్ణయినా పచ్చగ ఉన్నంత కాలమే సల్లంగ సూస్తా రెవరైనా! నా పిచ్చి కాకపోతే కష్ట కాలంలో తోటి మడిసినే ఆదుకోలేని ఈ కాలం మడుసులు ఆ దేముణ్ణే ఎలా ఆదుకొంటార్లే?" అన్న రిక్షా రంగడి మాటలకు శేఖరం కళ్లు తుడుచుకోవటం ఆనంద్ గమనించలేదు. ★